బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా రాధామోహన్‌దాస్



బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఎంపీ రాధామోహన్‌దాస్ అగర్వాల్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాలు జారీ చేశారు. సహాయ ఇన్‌చార్జ్‌గా సుధాకర్‌రెడ్డిని నియమించారు. వీరిద్దరూ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి పనిచేశారు. వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వారిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. కాగా రాష్ట్రానికి చెందిన నిర్మల్‌కుమార్ సురానాను పుదుచ్చేరి ఇన్‌చార్జిగా నియమించారు.

కుమార కట్టడి

- కేంద్రమంత్రి జనతాదర్శన్‌కు రాష్ట్ర సర్కార్ షాక్
- అధికారులు పాల్గొనకుండా మౌఖిక ఆదేశాలు
- మేం ఢిల్లీలో సమీక్షలు చేయలేం కదా : డీకే శివకుమార్
- అధికారుల గైర్హాజరు తప్పు: మంత్రి సతీశ్‌జార్కిహొళి



సమస్యలు వింటున్న కుమారస్వామి



హాజరైన జనం



ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో కీలకమైన ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. రాజకీయంగా వేర్వేరు పార్టీలైనా గతంలో ఎన్నడూలేని విధంగా అధికారులను కేంద్రమంత్రి కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కాకుండా కట్టడి చేసింది. మండ్య లోక్‌సభ స్థానం నుంచి జేడీఎస్-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా కుమారస్వామి గెలుపొందాక ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి అయ్యారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టాక కుమారస్వామి పదిరోజులక్రితం సొంత నియోజక వర్గం మండ్యలో పర్యటించారు. జిల్లా ప్రజలు సాదరంగా స్వాగతించారు. జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా సమస్యలు ఉన్నాయని, నేరుగా ప్రజలు చెప్పుకోవాలనుకుంటున్నారని వివరించారు. దీంతో లోక్‌సభ సమావేశాలు ముగిసిన తర్వాత రాష్ట్రానికి వచ్చిన వెంటనే మండ్యలో జనతాదర్శన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే బెంగళూరుకు చేరుకున్న కేంద్రమంత్రి కుమారస్వామి శుక్రవారం మండ్యలో జనతాదర్శన్ ఏర్పాటు చేశారు. ఆ మేరకు పార్టీవర్గాలు ఏర్పాట్లు చేశాయి. మంత్రి కుమారస్వామి ఉదయం మైసూరుకు చేరుకుని అక్కడ చాముండేశ్వరి దేవిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి మండ్యకు రాగా జిల్లాస్థాయి అధికారులు ఎవరూ కనిపించలేదు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి కుమారస్వామి మాట్లాడారు. మండ్యలో గత ఏడాది పంటల సాగు సాధ్యం కాలేదని, తీవ్రంగా నష్టపోయామని కొందరు విన్నవించినట్లు తెలిసింది. మరికొందరు విద్య, ఆరోగ్యం, ఇతరత్రా ప్రభుత్వ పథకాలకు సంబంధించి వినతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కొద్దిసమయం తర్వాత అధికారులు రావచ్చునని భావించారు. జనతాదర్శన్ గంటలు గడిచినా అధికారులు ఎవరూ కనిపించలేదు. జనతాదర్శన్‌లో అధికారులు పాల్గొనకపోవడంపై కేంద్రమంత్రి కుమారస్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండ్యలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు జనతాదర్శన్ ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. కేంద్రమంత్రి అయ్యేందుకు ఇక్కడి ప్రజల ఆశీస్సులే కారణమని, వారి సమస్యలు తెలుసుకోవడం తన కర్తవ్యం అన్నారు. మండ్య ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే వచ్చానని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులకు స్పష్టంగా సూచించి దూరంగా ఉండాలని ఆదేశించినట్లు తెలుస్తోందన్నారు. అందుకే అధికారులు ఎవరూ జనతాదర్శన్‌వైపు రాలేదన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు కేంద్రం ద్వారా న్యాయం చేస్తానని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సర్వత్రా చర్చ

కేంద్రమంత్రి కుమారస్వామి జనతాదర్శన్‌పై రాష్ట్ర మంత్రులు భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. డీసీఎం, జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ జిల్లా అధికారులకు నిబంధనలు ఉంటాయని పేర్కొన్నారు. తాము ఢిల్లీ అధికారులతో సమీక్షలు జరుపుకోవడం సాధ్యమా అని ప్రశ్నించారు. పరోక్షంగా కుమారస్వామి సభకు అధికారులు ఎందుకు వెళ్తారనే రీతిలో మాట్లాడారు. డీసీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సతీశ్‌జార్కిహొళి మాట్లాడడం ఇరువురి మధ్య అగాథానికి మరోసారి బహిర్గతం చేస్తోంది. అధికారులు అలా వ్యవహరించడం సరికాదన్నారు. జనతాదర్శన్ ఏర్పాటు చేస్తే స్థానిక అధికారులు భాగస్వామ్యం కావాల్సిందే అన్నారు. ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రి జనతాదర్శన్‌లో జిల్లా అధికారులు పాల్గొనాల్సి ఉండేదన్నారు. ఇటీవలే బెళగావిలో ఎంపీ జగదీశ్‌శెట్టర్ జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేయగా జిల్లా అధికారి, ఎస్పీ అందరూ పాల్గొన్నారని గుర్తు చేశారు. అధికారులు జనతాదర్శన్‌కు వెళ్లరాదని ప్రభుత్వం నుంచి సూచనలు లేవన్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మండ్యలో జరిగే జనతాదర్శన్‌కు దూరంగా ఉండాలని జిల్లా అధికారులకు మౌఖికంగా సూచించినట్లు తెలుస్తోంది. కేంద్రంలో కీలకమంత్రిగాను, తాజాగా ఆర్థిక శాఖ కమిటీ సభ్యుడిగా నియమితులైన కుమారస్వామి ఢిల్లీ స్థాయిలో ఫిర్యాదు చేస్తే మండ్య జిల్లా అధికారి, ఎస్పీలపై తీవ్ర చర్యలు ఉంటాయనే వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయ నేతలు వారి వ్యక్తిగత ప్రతిష్టతో అధికారులను బలి చేసినట్లు అవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో కుమారస్వామి బాధ్యతలు చేపట్టి ఇంకా నెల రోజులు పూర్తి కాలేదు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం ఆయన కార్యక్రమాలను అధికారుల ద్వారా అడ్డుకోవాలనే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. భవిష్యత్తులో మరెన్ని సమస్యలు తలెత్తుతాయో అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనతాదర్శన్ ద్వారా కుమారస్వామిని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందామని భావిస్తే రాష్ట్రానికి భారీ పరిశ్రమలు, ఉక్కుతోపాటు ఇరతత్రా ప్రతిపాదనలకు ఆయన తిప్పికొట్టే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంపట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల కుమారస్వామికి అంకితభావం ఉన్నా రాజకీయంగా దీటైన సమాధానం చెప్పాలని భావిస్తే రాష్ట్రానికి మరింత నష్టం తప్పదని రాజకీయ పరిశీలకుల అంచనా వేస్తున్నారు.

సివిల్స్ విద్యార్థులకు చేయూత

- ఢిల్లీలో కోచింగ్‌కు వెళ్లే ఎస్సీ, ఎస్టీలకు రూ.15 వేలు ప్రోత్సాహకం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఐఏఎస్, ఐఆర్ఎస్ పరీక్షలకు శిక్షణ పొందే విద్యార్థుల కోసం శాశ్వతంగా హాస్టల్‌ను నిర్మిస్తామని, వారికి నెలకు రూ.15వేల ప్రోత్సాహకం అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. శుక్రవారం విధానసౌధలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి పరిషత్ సభలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో కొత్తగా నిర్మించదలిచిన హాస్టల్‌లో హైటెక్ లైబ్రరీలో పుస్తకాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఢిల్లీలో కోచింగ్ తీసుకునే విద్యార్థులకు రూ.10వేలు ప్రోత్సాహకం ఇస్తున్నారని, అదనంగా రూ.5వేలు పెంచుతున్నామని, ఇది వెంటనే అమలులోకి వస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సబ్‌ప్లాన్ నిధులు వినియోగించేందుకు యాక్షన్‌ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. సబ్‌ప్లాన్‌లో 39,127 కోట్లను 34 శాఖలకు కేటాయించేందుకు సంబంధించి యాక్షన్‌ప్లాన్ పొందుపరిచామని అన్నారు. గత ఏడాదికంటే రూ.3,900 కోట్లు ఎక్కువ కేటాయించామన్నారు. చట్టంలోని 7డి సెక్షన్ తరహాలోనే 7సి కూడా రద్దు చేయాలని ఎమ్మెల్యే నరేంద్రస్వామి సూచనలు పరిశీలిస్తున్నామన్నారు. మంత్రి మహదేవప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

చామరాజపేటలో ఆకస్మిక తనిఖీలు



చామరాజపేట పాఠశాలలో విద్యార్థినులతో సీఎం కరచాలనం

చామరాజపేటలోని మొరార్జీదేశాయ్ పాఠశాలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో గంటకుపైగా గడిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను మొరార్జీదేశాయ్ వసతి పాఠశాలగా మార్పు చేశారు. 218 మంది విద్యార్థులు ఉండగా వారితో చదువు, బోధనలు ఇతరత్రా అంశాలపై సీఎం మాట్లాడారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారుల బదిలీలు ప్రక్రియ ముగియగానే భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. పర్యాటకశాఖ, జలమండలి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న రామ్‌ప్రసాత్ మనోహర్‌ను నగరాభివృద్ధి శాఖ అడిషినల్ సెక్రటరీగా బదిలీ చేసింది. నితేశ్ పాటిల్‌ను ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌గా, అరుంధతి చంద్రశేఖర్‌ను పంచాయతీరాజ్ కమిషనర్‌గా, జ్యోతిని జౌళి అభివృద్ధి కమిషనర్‌గా, శ్రీధర్ సీఎస్‌ను గ్రామీణాభివృద్ధి సోషల్‌ఆడిట్ డైరెక్టర్‌గా, డాక్టర్ కేవీ రాజేంద్రను టూరిజం డైరెక్టర్‌గా, చంద్రశేఖర్ నాయక్‌ను కమర్షియల్ ట్యాక్సెస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషినల్ కమిషనర్‌గా, విజయ్ మహంతేశ్ ధనమ్మనవర్‌ను హావేరి డీసీగా, గోవిందరెడ్డిని గదగ్ డీసీగా, రఘునందన్ మూర్తిని ట్రెజరీస్ కమిషనర్‌గా, డాక్టర్ గంగాధరస్వామిని దావణగెరె డీసీగా, లక్ష్మీకాంతరెడ్డిని మైసూరు డీసీగాను, నితీశ్ కేను రాయచూరు డీసీగా, మహ్మద్ రోషన్‌ను బెళగావి డీసీగా, శిల్పాశర్మను బీదర్ డీసీగా, డాక్టర్ దిలీశ్‌శశిని ఇ-గవర్నెన్స్ సీఈఓగా, లోఖండె స్నేహాల్ సుధాకర్‌ను విద్యుత్ కార్ఖానె ఎండీగా, శ్రీరూపను పశుసంవర్ధకశాఖ కమిషనర్‌గా, ఇట్టి మాధవ్ విఠల్‌రావ్‌ను పునరావాస విభాగం జీఎంగా, హేమంత్‌ను శివమొగ్గ జడ్పీ సీఈఓగా, మహ్మద్ అలి అక్రం షాను విజయనగర జడ్పీ సీఈఓగా ప్రభుత్వం బదిలీ చేసింది.

పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి ఎప్పుడో..?

- నెల రోజుల క్రితమే తరగతులు ప్రారంభం
- పలుచోట్ల విద్యాశాఖ అధికారుల మెరుపుదాడులు

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలనే లక్ష్యం సాధ్యం కాలేదు. గడిచిన కొన్నేళ్లుగా రాష్ట్రంలో విద్యాసంస్థల ప్రారంభించే రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అదే తరహాలోనే ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభానికి దాదాపు రెండు నెలలకాలంగా కసరత్తు చేసింది. విద్యాసంవత్సరం ప్రారంభించి నెలరోజులు ముగిసింది. సుమారు 95 శాతం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఇంకా 5 శాతం మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదు. పాఠ్యపుస్తక ముద్రణాసంఘం రాష్ట్రంలోని స్టేట్ సిలబస్ బోధించే 75వేల పాఠశాలలకుగాను 2024-25 విద్యాసంవత్సరంలో 10.55 కోట్ల పాఠ్యపుస్తకాలను ప్రింటింగ్‌కు డిమాండ్ స్వీకరించింది. ఇప్పటి వరకు 9.13 కోట్ల పాఠ్యపుస్తకాలను ముద్రించింది. విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాల సవరణ నేపథ్యంలో గడువులోగా ముద్రించి పాఠశాలలకు పంపడం కొంత జాప్యమైనట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. సవరించిన పాఠ్యపుస్తకాలను ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను మార్చి మొదటి వారంలో సమర్పించింది. తుది పరిశీలనలు జరిపి ఆదేశాలు జారీ చేయడంలో కొంత జాప్యం జరిగింది. కర్ణాటక పాఠ్యపుస్తకాల సంఘం నివేదికల ప్రకారం దాదాపు 95 శాతం టెక్స్ట్ బుక్‌లను పంపిణీ చేశామని ప్రకటించింది. వాస్తవానికి సరఫరా చేసింది ఇంకా తక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన పుస్తకాలు రాలేదంటూ ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలలో ప్రింటింగ్ పూర్తయిందని గోడౌన్‌ల నుంచి తరలిస్తున్నామని పేర్కొన్నారు. కానీ ప్రతి ఏటా పాఠ్యపుస్తకాల పంపిణీ విషయంలో ఇదే తరహాలోనే నిర్లక్ష్యం ఉందని ప్రైవేట్ పాఠశాలల సంఘం ఆరోపించింది. ఆర్టీఈ ద్వారా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలల్లో ఉచితంగా అడ్మిషన్లు నిర్వహించారు. వారికి ఏటా పాఠ్యపుస్తకాలను ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేట్ విద్యాసంస్థల సమాఖ్య సమాచారం ప్రకారం విద్యాశాఖ పంపిణీ చేశామని చెబుతున్న పాఠ్యపుస్తకాలలో వాస్తవం లేదని ఆరోపించింది. కనీసంగా పాఠ్యపుస్తకాల సాఫ్ట్‌కాపీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే వాటిని ప్రింటు తీసుకుని పాఠ్యాంశాలు కొనసాగించే వీలుంటుందని, కొన్నేళ్లుగా ఈ ప్రతిపాదన సూచిస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు.

గోడౌన్లపై మెరుపుదాడులు

పాఠశాలల వారీగా డిమాండ్‌కు అనుగుణంగా పాఠ్యపుస్తకాలను తాలూకా స్థాయికి సరఫరా చేసినా వాటిని గ్రామాల వారిగా చేర్చడంలో ప్రాంతీయ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఈ మేరకు గురువారం కర్ణాటక టెక్స్ట్ బుక్స్ సొసైటీ (కేటీబీఎస్) వివిధ ప్రాంతాల్లో మెరుపు దాడులు చేసింది. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులైనా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు చేరలేదనే ఆరోపణలు ఉన్నాయి. కేటీబీఎస్ అధికారులు బెంగళూరు హెబ్బాళ కెంపాపుర, కర్ణాటక పబ్లిక్‌స్కూల్, హొసకెరెహళ్లి ప్రభుత్వ పాఠశాలతోపాటు బెంగళూరు వ్యాప్తంగా వివిధ డివిజన్‌లలో పాఠశాలలను అధికారులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదనేది రుజువైంది. దీంతో అధికారులు బ్లాక్ లెవెల్ గోడౌన్లను పరిశీలించగా దాదాపు అన్ని చోట్ల నిల్వ ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. బీఈఓలు, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాల్సిన బ్లాక్‌స్థాయి అధికారులపై కేటీబీఎస్ ఉన్నతాధికారులు మండిపడ్డారు. ఇదే తరహాలో నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని హెచ్చరించారు. బెంగళూరు, తుమకూరుతోపాటు పలు చోట్ల పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు చేరలేదనే ఆరోపణలు ఉన్నాయి. వెంటనే అన్ని పాఠశాలలకు పుస్తకాలు చేరాల్సిందేనని కేటీబీఎస్ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రతి తాలూకా స్థాయికి 95 శాతం దాకా పాఠ్యపుస్తకాలను సరఫరా చేశారు. బ్లాక్ స్థాయిలో అధికారుల నిర్లక్ష్యం చేయడంతో సమగ్రంగా పిల్లలకు పాఠ్యపుస్తకాలు చేరలేదనేది స్పష్టమైంది. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని బ్లాక్‌ల విద్యాశాఖ అధికారులకు వాస్తవ పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో రాష్ట్రమంతటా పాఠ్యపుస్తకాల పరిశీలనకు పరుగులు తీశారు.




వరద పరవళ్లు

- తుంగ జలాశయం 14 గేట్లు ఎత్తివేత
- 40 వేల క్యూసెక్కుల విడుదల
- టీబీ డ్యాంలోకి ఒకేరోజు 3 టీఎంసీల నీరు


బళ్లారి గాంధీనగర్, జూలై 5: తుంగభద్ర జలాశయానికి ఎగువన మలెనాడు ప్రాంతంలో భారీ వర్షాలకు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో శివమొగ్గ జిల్లా గాజిగనూరు సమీపంలోని తుంగ జలాశయం నిండింది. జలాశయం భద్రత దృష్ట్యా 15 క్రస్టుగేట్ల ద్వారా 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. భద్ర జలాశయానికి 4,098 క్యూసెక్కుల వరద చేరుతోంది. అదే ప్రాంతంలో లింగనమక్కి జలాశయానికి 60,238 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఈ వరద నీరు తుంగభద్ర జలాశయం దిశగా పరుగులు పెడుతోంది. గంటగంటకూ ఇన్‌ఫ్లో పెరుగుతోంది. తుంగభద్ర జలాశయానికి శుక్రవారం ఉదయం 19,201 క్యూసెక్కుల వరద చేరుతోంది. జలాశయం నీటి నిల్వలు 11.71 టీఎంసీలకు చేరాయి. ఒకే రోజు మూడు టీఎంసీల నీరు చేరింది. గత ఏడాది ఇదే సమయానికి ఇన్‌ఫ్లో కేవలం 259 క్యూసెక్కులు కాగా, జలాశయంలో నీటి నిల్వలు 3.07 టీఎంసీలు ఉండేవని బోర్డు అధికారులు తెలిపారు.

శివమొగ్గ వద్ద తుంగ నది ప్రమాద స్థాయిలో ప్రవాహం



తుంగ జలాశయం క్రస్ట్‌గేట్ల గుండా ఉరకలేస్తున్న వరదనీరు





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,590.80	1,576.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	19,201	259
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	295	60
సామర్థ్యం (టీఎంసీలు)	11.71	3.07

వంద మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ప్రజలు

బళ్లారి సిటీ, జూలై 5: సండూరు తాలూకా సుల్తాన్ పూర్ దగ్గర జేవీఎంఎల్ ప్రాజెక్ట్ ఎల్ అండ్ టీ సిబ్బంది, బళ్లారి నగర స్పందన రక్తనిధి కేంద్రం సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం రక్తదానశిబిరాన్ని ఏర్పాటు చేశారు. .ఈసందర్భంగా ఉమాసాథియన్ కార్యక్రమాన్ని ప్రారంభించి రక్తదానం గొప్పదనాన్ని తెలిపారు. హెన్నింగ్ హోల్క్ లార్సన్ 107వ జయంతి సందర్భంగా ఈ స్వయం ప్రేరిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు, శిబిరంలో 102 మంది రక్తదానం చేశారని తెలిపారు.

పర్యావరణాన్ని ప్రేమించాలి: ఎమ్మెల్యే



మొక్క నాటి, నీరు పోస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి సిటీ, జూలై 5: పర్యావరణం మనకు ప్రాణం లాంటిదని, విద్యార్థులు పర్యావరణ ప్రేమికులుగా మారాలని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప సూచించారు. హొస్పేటలోని రీజనల్ ఫారెస్ట్ జోన్ సహకారంతో జంబునాథనహళ్ళి కొండ సమీపంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణాన్ని ధ్వంసం చేయకుండా కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. ప్రకృతి నుంచి మనకు మంచి ఆక్సిజన్ అందుతుందని, మెరుగైన వాతావరణాన్ని సృష్టించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఏడాదికి ఐదుచెట్లు నాటాలని సూచించారు. సోషల్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డీసీఎఫ్ రవి ప్రారంభోపన్యాసం చేసి, అమ్మపేరుతో ఒక చెట్టును నాటితే ఆ చెట్లు సమృద్ధిగా పెరుగుతాయన్నారు. మన దగ్గర అనేక రకాల జాతుల చెట్లు ఉన్నాయని, వాటిని మనం కాపాడుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా పోలీసశాఖకు చెందిన శ్రీహరిబాబు, అంబేడ్కర్ పాఠశాల, ఆదర్శ విద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా మించు శ్రీనివాస్



అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పెద్దన్న

బళ్లారిరూరల్, జూలై 5: బళ్లారి నగరంలోని బెంగళూరు రోడ్డు లారీ ధర్మల్ ఆవరణలో శుక్రవారం లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మించు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా నూర్ మహమ్మద్‌ను ఎన్నుకున్నారు. కార్యాలయంలో నూతన పదాధికారులు సమావేశమై అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లారీ ఓనర్లకు, డ్రైవర్లకు, క్లీనర్లకు రవాణాకు సంబంధించి ఏవైనా సమస్యలు వుంటే అందుబాటులో వుండి సేవలు అందిస్తానని, అదేవిధంగా లారీ ధర్మల్‌లో దూరం నుంచి వచ్చిన డ్రైవర్లకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు పెద్దన్న, ప్రధాన కార్యదర్శి మహబూబ్ సాబ్, కార్పొరేటర్లు ప్రభంజన్ కుమార్, బీఆర్‌ఎల్ శీన, బసవరాజు, లారీ అసోసియేషన్ కార్యనిర్వాహకులు విశ్వనాథ్ పలువురు లారీ ఓనర్లు, డ్రైవర్లు, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మట్టెద్దుల అమావాస్య.. మిన్నంటిన సంబరాలు





ప్రత్యేకాలంకరణలో సిరుగుప్ప తాయమ్మదేవి బళ్లారి కనకదుర్గమ్మ



ప్రత్యేక పూజలందుకున్న కంప్లి కాళికాదేవి



బళ్లారి, కంప్లి పట్టణాల్లో పూజలందుకున్న మట్టిఎద్దులు

మట్టెద్దుల అమావాస్య సందర్భంగా బళ్లారి నగరంలో మట్టి ఎద్దులను ప్రజలు జోరుగా కొనుగోలు చేశారు. వాటిని అలం కరించి ఘనంగా పూజలు చేశారు. ఈ వేడుక సందర్భంగా ఆలయాలన్నీ కిటకిటలాడాయి. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చేళగుర్కి యర్రితాత ఆలయంలో కూడా అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బాలనగౌడ తెలిపారు. అదేవిధంగా సండూరు తాలుకాలోని కుమారస్వామి ఆలయంలో కూడా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి ప్రధాన అర్చకులు శ్రీనివాస, కుంకుమార్చన, పుష్పాలంకరణ, మహామంగళ హారతి కార్యక్రమాలను చేపట్టారు. కంప్లిలో పేట బసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పార్చన తదితర సేవలు చేపట్టారు. బుక్కసాగర వద్ద వున్న ఏకుపడగల నాగప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే షుగర్ ఫ్యాక్టరీలోని కాళికాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేకపూజలు చేపట్టారు.

✍ బళ్లారి రూరల్, కంప్లి, సిరుగుప్ప

మేయర్ ముల్లంగి నందీశ్‌కు సన్మానం



నందీశ్‌ను సన్మానిస్తున్న అమరేంద్రనాథ్ చౌదరి తదితరులు

బళ్ళారి సిటీ, జూలై 5: ఇటీవల బళ్లారి నగర మేయర్‌గా ఎన్నికైన ముల్లంగి నందీశ్‌ను శుక్రవారం జియాలజిస్టు చల్లా అమరేంద్రనాథ్ చౌదరి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు సన్మానించారు. నందీశ్‌కు అమరేంద్రనాథ్ చౌదరి శాలువ కప్పి అభినందనలు తెలియజేశారు. లాండ్ లార్డ్ ఆంజనేయులు, చింబిలి ప్రసాద్, గోనుగుంట్ల రామ్మోహన్, గుర్రం లాల్ మోహన్,మహేశ్ తదితరులు మేయర్‌ను పుష్పమాలతో సత్కరించారు. యువకుడైన నందీశ్ నాయకత్వంలో బళ్లారి కర్ణాటకలోనే సుందర నగరంగా నిలవాలని వారు ఆకాంక్షించారు. 1956లో స్వర్గీయ ముల్లంగి దొడ్డబసప్ప బళ్లారి పురపాలక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై సమర్థవంతంగా బాధ్యతులు నిర్వహించారు. దాదాపు 70ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆయన తమ్ముని మనుమడు బళ్లారి మేయర్ గా ఎన్నిక కావడం విశేషం. నగర ప్రజలు మేయర్ ఎన్నికను స్వాగతించి అభినందిస్తున్నారు.

చెరువుకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలి

కంప్లి, జూలై 5 : కమలాపురం చెరువులో రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. విజయనగర జిల్లాలోనే ఎంతో పేరుగాంచిన చెరువు ఇది. చెరువు పక్కన రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది విహారయాత్రికులు తమ సెల్‌ఫోన్‌తో ఫోటోలు తీసేందుకు వెళ్లి చెరువులో పడిన సంఘటనలు కూడా వున్నాయి. అలాగే వేగవంతంగా వెళుతున్న వాహనాల వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముందుజాగ్రత్తగా చెరువుకు రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రమాదం చోటు చేసుకోకుండా చూడాలని బీఎస్‌ఎస్ అధ్యక్షులు చెన్నప్ప కోరారు. అలాగే చెరువులో పిచ్చి మొక్కలు తొలగించి నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. మొత్తానికి ఈ చెరువును ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు.



పిచ్చి మొక్కలతో నిండిపోయిన కమలాపురం చెరువు

గ్రామాల్లో డెంగీ వ్యాప్తిని అరికట్టాలి

- జిల్లాపంచాయతీ డిప్యూటీ సెక్రటరీ గిరిజాశంకర్

బళ్లారి సిటీ, జూలై 5: జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని నీటి నిల్వలను వారానికోసారి శుభ్రంచేసి డెంగ్యూ వ్యాప్తిని అరికట్టాలని జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి గిరిజాశంకర్ అన్నారు. జిల్లావైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం బండిహట్టి గ్రామంలోని ఇళ్ళు, పాఠశాలలు, అంగన్‌వాడీలలో నీటి నిల్వలను పరిశీలించారు. ప్రతి శుక్రవారం ఏడీస్ దోమల లార్వా నిర్మూలన దినంగా భావించాలన్నారు. ఇటీవల ప్రతిచోటా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయని, బళ్లారి జిల్లాలో వ్యాధి నియంత్రణకు వివిధ శాఖలు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయన్నారు. నీటిని నిల్వచేసే పాత్రలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు ప్రజల సహకారం అందించి రోగాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లలోని నీటి నిల్వలలో లార్వా (దోమలు) కనిపిస్తే వాటిని ఖాళీ చేయాలన్నారు. ఈ విషయమై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు.

జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధికి నిర్దిష్ట చికిత్స లేదని తెలిపారు. లక్షణాల ఆధారంగా చికిత్స చేస్తారని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఎవరైనా ఇంట్లో జ్వరంతో బాధపడుతుంటే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. అదనంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సహా వైద్య బృందం గ్రామవార్డుల్లో ఇంటికి వచ్చినప్పుడు దోమలను ఉత్పత్తి చేసే డ్రమ్ములు, స్టోన్ బకెట్లు, సిమెంట్ ట్యాంకులు మొదలైన వాటిని తనిఖీ చేయడానికి అనుతించాలన్నారు. నీటిలో లార్వాలు (దోమపిల్ల) కనిపిస్తే దానిని ఖాళీ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి చుట్టూ టైర్లు, డబ్బాలు, ప్లాస్టిక్ కప్పులు ఇతర పదార్థాలను పారవేయడం ద్వారా డెంగీ నివారణకు సహకరించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈసందర్భంగా జిల్లా అంటువ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, బండిహట్టి వైద్యాధికారి డాక్టర్ యాస్మిన్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, జిల్లాపంచాయితీ అధికారి చంద్రశేఖర్ హిరేమఠ్, ఎస్వీబీడీసీ జిల్లా కౌన్సెలర్ ప్రతాప్ పాల్గొన్నారు.



నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు

జనావాసాల్లోకి ఎలుగుబంటి

- మత్తుమందు ఇచ్చి అదుపులోకి తీసుకున్న అటవీ సిబ్బంది



చెట్టుకొమ్మపై కూర్చున్న ఎలుగుబంటి

బళ్లారి సిటీ,జూలై 5: విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్ళి గద్దికేరి గ్రామంలో వేపచెట్టుపై కూర్చున్న ఓ ఎలుగుబంటిని ఆటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలోని చలవాది వీధిలో ఉదయం ఆరు గంటలకు ఎలుగుబంటి కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జనం కేకలు వేస్తూ హంగామా చేయడంతో ఎలుగుబంటి పక్కనే ఉన్న చెట్టుపై ఎక్కి కూర్చుంది. వెంటనే విషయాన్ని ఆటవీశాఖ అధికారులకు తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు, సిబ్బంది ఆపరేషన్ ప్రారంభించి ఎలుగుబంటికి మత్తు మందు ఇచ్చి కిందకు దించి ఎలుగుబంటి మెడపై ఉన్న గాయానికి చికిత్స చేశారు. ఎలుగుబంటిని దరోజీ కరడిదామంలో విడిచిపెడతామని ఆటవీ అధికారి కరిబసప్ప తెలిపారు. ఈసందర్భంగా హడగలి మండల ఆటవీ అధికారిణి రేణుక, డిప్యూటీ మండల ఆటవీ అధికారి తిరుమలేశ్, వైద్యాధికారి వాణి, ఫారెస్ట్ గార్డ్ రాజేంద్రకుమార్, మంజునాథ్ ,సాగర్, శ్రీకాంత్,రాము పాల్గొన్నారు.

13న రాష్ట్రీయ లోక్ అదాలత్

బళ్లారి సిటీ,జూలై 5: జిల్లాలో జూన్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ప్రజలు, పార్టీలు పరస్పరం కేసులను త్వరగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. తాళూరు రోడ్డులోని కొత్త జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ రాజీ చర్చలలో పాల్గొనడం ద్వారా ఆర్థిక భారం, సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరిస్తే కోర్టు ఫీజు పూర్తిగా వాపసు చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



డెంగీపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ

సిరుగుప్ప, జూలై 5 : డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది వాడవాడలా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ ఆధ్వర్యంలో పాత తహసీల్దార్ ఆవరణంలో డెంగీ వ్యాపించడంపై ఆయన అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యాధి దోమల వలన వస్తుందని తెలిపారు. నిల్వ నీటిలో దోమలు వుంటాయని ఆయన తెలిపారు. డ్రమ్ములను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని తెలిపారు. నీటిని ఎక్కువ రోజులు నిల్వ వుంచరాదన్నారు. తాలుకాలో ప్రతి ఒక్కరు డెంగీ పట్ల అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు.

హోసూరు జోన్

పశువుల యజమానులకు జరిమానా



రోడ్లపై తిరుగుతున్న పశువులు

హోసూరు, జూలై 5: హోసూరు కార్పొరేషన్ మున్సిపల్ కమీషనర్ స్నేహా ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారి డాక్టర్ ప్రభాకరన్ రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతున్న 10 పశువులను స్వాధీనం చేసుకున్నారు. పశువుల యాజమానులకు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువులను తమ రక్షణలో మాత్రమే పెంచుకోవాలని, రోడ్లపై ఇలా విచ్చల విడిగా వదలొద్దని, మళ్లీ యథాప్రకారం ఇలానే జరిగితే పశువులను తిరిగి ఇచ్చేదిలేదని తెలిపారు. పశువులను రోడ్లపై ఇలా వదిలేయడం వల్ల ఎంతో మందికి ప్రాణ నష్టం కూడా వాటిల్లుతుందని, కాబట్టి రవాణా శాఖ చర్యలు తీసుకోవల్సి ఉంటుందని పేర్కొన్నారు. పశువులను పెంచే యజమానులు తమ స్వంత స్థలాలోనే పశువులను సంరక్షణ చేయాలని, ఎవ్వరికి ఏ హానీ కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలు సంచరించడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని, అలాగే రాకపోకలకు, వ్యాపారులకు, దుకాణాదారులకు అంతరాయం కలుగుతోందని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

హోసూరు జూలై 5 శుక్రవారం హోసూరు సిప్‌కాట్ పోలీస్ స్టేషన్‌ల్లో 171 సిసి కెమెరాలను ప్రారంభించారు. హోసూరు సిప్‌కాట్ ప్రాంతంలో పెద్దసంఖ్యలో కర్మాగారాలు పనిచేస్తున్నాయి. అలాగే ఆ ప్రాంతంతో బెంగళూరూ- చెన్నైకి జాతీయ సరిహద్దు ఉండడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నేరగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. చోరీలు, హత్యలు, దోపిడీలు, కార్ల చోరీలు తదితర సంఘటనల్లో పోలీసులు చాల శ్రమించి నిందితులను కనిపెటాల్సి వస్తుంది, ఆ ప్రాంతంలో పని చేస్తున్న కర్మాగారాల సహాయంతో పోలీసులకు సహాయం అందించేందుకు సిసి కెమరాలను మూడో కన్నుగా అమర్చేందుకు ఎస్పీ ఏర్పాటు చేశారు. శుక్రవారం సిప్‌కాట్ పోలీస్ స్టేషన్‌లో సిసి కెమరాల ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఎస్పీ తంగదురై పాల్గొని పోలీసు బృందంతో మొక్కలు నాటారు. కార్యక్రమానికి డీఎస్పీ బాబు ప్రసాంత్ అధ్యక్షత వహించారు.

కృష్ణగిరి జలాశయం నుంచి నీటి విడుదల

హోసూరు(కృష్ణగిరి) జూలై 5 : కృష్ణగిరి జలాశయం నుంచి పార్లమెంట్ సభ్యుడు కె.గోపినాథ్ కుడి, ఎడమ ప్రధాన కాలువలకు శుక్రవారం నీరు విడుదల చేశారు. కృష్ణగిరి డ్యాం నుంచి సెకనుకు 75 క్యూబిక్ అడుగుల చొప్పున, ఎడమ కాల్వ ద్వారా మొత్తం 151 క్యూబిక్ అడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. దీని ద్వారా పెరియ ముత్తూరు, సుండకుప్పం, తిమ్మాపురం, సౌట్టల్లి, తళిహళ్లి, కాల్వేహళ్ళి , గుండలపట్టి, మిట్టహళ్లి, ఎర్రహళ్లి, బెన్నేశ్వర మట్టం, కావేరిపట్టణం, బాలేగుళ్లి, మారిసెట్టిహళ్లి, నాగోజహళ్లి, జనపరహళ్లి, పయూరు తదితర 16 పంచాయతీల్లో 9,012 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.



నీటిని విడుదల చేస్తున్న పార్లమెంట్ సభ్యుడు కె.గోపీనాథ్

జనస్పందనలో అత్యధికం మున్సిపల్ సమస్యలే



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కంప్లి, జూలై 5 : కంప్లి పట్టణం సత్యనారాయణ పేట ప్రభుత్వ పాఠశాలలో జిల్లా అధికారులు శుక్రవారం ఏర్పాటు చేసిన జనస్పందన కార్యక్రమంలో పురసభ సమస్యలపైనే 117 అర్జీలు జిల్లా అధికారికి అందాయి. మొత్తం 307 అర్జీలు రాగా అందులో 117 అర్జీలు కేవలం పురసభవే వుండటం గమనార్హం. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ ఇప్పటికే కంప్లి తాలుకాలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలోనే మినీ విధానసభకు మరొక రూ. 5 కోట్లు కేకేఆర్‌డీపీ నిధులు మంజూరు చేయాలని లేఖ రాసినట్లు తెలిపారు. అనంతరం ఇతరులు మాట్లాడుతూ సరియైన సమయానికి బస్సు సౌకర్యం లేదని, ఇప్పటికీ డీఈవో కార్యాలయం ప్రారంభం కాలేదని, ఫైర్ స్టేషన్, కోర్టు తదితర కార్యాలయాలు ప్రారంభించలేదన్నారు. అక్రమ సక్రమ ద్వారా లబ్దిదారులకు బహురుకం సమితి ఏర్పాటు చేసి వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ త్వరలోనే తమ నాయకులతో చర్చించి తాలుకాకు అవసరమైన కార్యాలయాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. బహురుకం సమితి ఏర్పాటు చేసి రైతులకు పట్టాలు అందిస్తామని తెలిపారు. అనంతరం మహిళలకు జిల్లా అధికారి, ఎమ్మెల్యేలు పట్టాలు అందజేశారు. జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. మున్సిపాల్టీ, కందాయి, రెవెన్యూ, గ్రామ పంచాయతీలలో సమస్యలు అధికంగా వున్నాయని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించని పక్షంలో ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయాశాఖల అధికారులు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని నిర్లక్ష్యం వహిస్తే వారిపై వేటుపడుతుందని తెలిపారు. వారితోపాటు జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సుంకనూరు, అడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్, తహసీల్దార్ శివరాజ్, ముఖ్య అధికారి దుర్గన్న, తాలుకా పంచాయతీ ఈవో శ్రీకుమార్, ఏడీ మల్లన్నగౌడ, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం అందలేదు : కౌన్సిలర్

కంప్లి, జూలై 5 : కంప్లి పట్టణంలో శుక్రవారం జరిగిన జనస్పందన కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదని కౌన్సిలర్ సీఆర్ హనుమంతు ఓ ప్రకటనలో తెలిపారు. తమ వార్డులో భూమిపూజలు, అభివృద్ధి పనులు జరిగినా పురసభ అధికారులు తమ దృష్టికి తీసుకురావడం లేదన్నారు. తాము ఎన్నికల్లో ప్రజలు ఎన్నుకున్న నాయకులైనా పురసభ అధికారులకు మాత్రం తమపై దృష్టి లేకుండా పోయిందన్నారు. కొన్ని సంవత్సరాల తరువాత జరిగిన జనస్పందన కార్యక్రమానికి తమ వార్డులో నెలకొన్న సమస్యలను వివరించాల్సి వుందని, తనకు ఈ విషయం తెలియకపోవడం బాధ కలిగించిందన్నారు. ఇక మీదట ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆర్‌జీ భండార్కర్ (జయంతి)



విద్వాంసులు, సంఘ సంస్కర్తలలో ఒకరైన 'సర్' రామకృష్ణ గోపాల్ భండార్కర్ 1837 జూలై 6న మహారాష్ట్ర రాష్ట్రం సింధుదుర్గ జిల్లా మాల్వాన్ ప్రాంతంలో జన్మించారు. ఆంగ్ల సాహిత్యం, చరిత్ర, సంస్కృతంపై పట్టు కలిగినవారు. 1862 బాంబే యూనివర్సిటీ నుంచి తొలి పట్టభద్రుల బ్యాచ్. యూనివర్సిటీ ఆఫ్ గొట్టిన్‌జెన్ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. గోపాలకృష్ణ గోఖలేతో కలసి అనధికార సభ్యుడిగా 'కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు ఎన్నికయ్యారు. కుల వ్యవస్థపై పోరాడి, స్త్రీ విద్యను, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించారు. బాల్యవివాహాలను అడ్డుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వంచే 1911లో 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్' బిరుదు పొందారు. 1925 ఆగస్టు 24న కన్నుమూశారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930 జూలై 6న తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకా శంకరగుప్తంలో జన్మించారు. 8ఏళ్లకే కచేరీ ప్రదర్శించి 'బాల మేధావి'గా ప్రశంసలు అందుకున్నారు. కర్ణాటక సంగీత గాయకుడు, వయోలిన్ విద్వాంసుడు, వాగ్గేయకారుడు, సినీ సంగీత దర్శకుడు, గాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రపంచ వ్యాప్తంగా 25వేలకుపైగా కచేరీలు చేశారు. టీటీడీ, శృంగేరీ పీఠాలకు ఆస్థాన విద్వాంసులుగా వ్యవహరించారు. గానగంధర్వ, గాయక శిఖామణి, పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మవిభూషణ్ సహా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఎన్నో విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశాయి. 2016 నవంబరు 22న కన్నుమూశారు.

బాబు జగ్జీవన్‌రామ్ (వర్ధంతి)




దేశ ఉపప్రధానిగా వ్యవహరించి 'బాబూజీ'గా పేరొందిన జగ్జీవన్‌రామ్ 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం ఆరా ప్రాంతంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. కాంగ్రెస్ పార్టీలో 40ఏళ్లపాటు వివిధ హోదాలలో కొనసాగారు. లోక్‌సభలో ప్రతిపక్షనేతగా కేంద్ర కార్మికశాఖ తొలి మంత్రిగా వ్యవహరించి కార్మిక సంక్షేమానికి, వెనుక బడినవర్గాల సంక్షేమానికి బాటలు వేశారు. హరిత విప్లవానికి నాంది పలికారు. 1971లో ఇండో-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా వ్యవహరించారు. 1952 నుంచి 1986 వరకు పార్లమెంటు సభ్యుడిగా కొనసాగి రికార్డు సృష్టించారు. 1986 జూలై 6న కన్నుమూశారు.

ధీరూభాయ్ అంబానీ (వర్ధంతి)



దేశం గర్వించదగిన పారిశ్రామిక వేత్తలలో ఒకరైన ధీరజ్‌లాల్ హీరాచంద్ అంబానీ 1932 డిసెంబరు 28న గుజరాత్‌లో జన్మించారు. 'ధీరూభాయ్ అంబానీ'గా పేరొం దారు. వ్యాపార దిగ్గజంగా ఎదిగి రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను స్థాపించారు. టెక్స్‌టైల్స్‌లో 'విమల్' బ్రాండ్ ప్రవేశపెట్టి విజయం సాధించారు. ఆసియాలో మోస్ట్ పవర్‌ఫుల్ వ్యక్తులలో ఒకరిగా గుర్తింపు పొందారు. 2002 జూలై 6న కన్నుమూశారు. వ్యాపార, పరిశ్రమల రంగాలలో ఆయన అందించిన సేవలకు గుర్తుగా మరణానంతరం 2016లో 'పద్మవిభూషణ్' ప్రకటించారు. ఆయన పిల్లలు కూడా పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు.

దలైలామా (పుట్టినరోజు)



దలైలామా పేరు చెబితే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధుల హృదయాలు పూజ్య భావంతో బరువెక్కుతాయి. బుద్ధుల మత గురువే కాదు ప్రవాస టిబెట్ ప్రభుత్వానికి అధినేత కూడా. ప్రస్తుత దలైలామా 14వవారు. 1935 జూలై 6న జన్మించారు. భారతదేశంలో శరణార్థిగా నివసిస్తున్నారు. దలైలామాను తుల్కస్ శ్రేణిలో ఒకరిగా పరిగణిస్తారు. తుల్కస్ అంటే కారుణ్యబోధిసత్వుడైన అవలోకి తేశ్వరుడి అవ తారమని భావిస్తారు. ఆరు ఖండాలలో 67దేశాలలో పర్యటించి శాంతి సందేశాలు ఇచ్చారు. 110కిపైగా పుస్తకాలు రాశారు. ఎన్నో గౌరవ డాక్టరేట్‌లు, పురస్కారాలు అందుకున్నారు. నోబెల్ శాంతిపురస్కారం, జర్మన్ మెడల్ ప్రైజ్ అందుకున్నారు.

సిల్వస్టర్ స్టాలోన్ (పుట్టినరోజు)



సిల్వస్టర్ స్టాలోన్ 1946 జూలై 6న జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, స్క్రీన్ రైటర్, దర్శకుడు, నిర్మాత. అమెరికా సినీ చరిత్రలో బాక్సాఫీస్ వద్ద ఆయన సినిమాలు విజయాన్ని సాధించాయి. 'రాకీ' సిరీస్‌తో నేషనల్ ఫిల్మ్ రిజిస్ట్రీలో నమోదు పొందారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. అకాడమీ అవార్డ్స్, బ్రిటీష్ అకాడమీ ఫిల్మ్ అవార్డ్స్, గోల్డెన్ రాస్ప్‌బెర్రీ అవార్డ్స్, పీపుల్స్ ఛాయిస్ అవార్డ్స్ తదితర అవార్డులు అందుకున్నారు.

నర్తకి నటరాజ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' నర్తకి నటరాజ్ 1964 జూలై 6న మధురైలో జన్మించారు. భరత నాట్యంలో రాణించి 'పద్మశ్రీ' అందుకున్న తొలి ట్రాన్స్‌జెండర్. తమిళ్ యూనివర్సిటీలో డెమాన్‌స్ట్రేషన్ అసిస్టెంట్‌గా వ్యవహరించారు. కేపీ కిట్టప్ప పిళ్ళై వద్ద నృత్యంలో తర్ఫీదు పొందారు. అనంతరం నర్తకి నృత్య కళాలయను ప్రారంభించి ప్రొఫెషనల్ డ్యాన్సర్‌గా కొనసాగారు. అమెరికా, యూకే, నార్వేలలో శాఖలు ఏర్పాటు చేసి నృత్యకళను ప్రోత్సహిస్తున్నారు. కళైమామణి, నృత్యచూడామణి, సంగీత నాటక అకాడమీ పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి

శిడ్లఘట్ట, జూలై 5: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో సత్తా చాటాలని తహసీల్దార్ బీఎస్ స్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యలో ఉన్నత హోదాలు అందుకునేందుకు పోటీ పరీక్షలు రాస్తుంటారని కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లా విద్యార్థులు తమ సత్తా చాటుకోవాలని కోరారు. కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలు కేవలం పట్టు, పాడి రంగానికే పరిమితం కాలేదని ఈ జిల్లా విద్యార్థులు పోటీ పరీక్షల్లో సాధన చేసిన రికార్డులు ఉన్నాయన్నారు. అప్పట్లో కేఏఎస్ అంటే కోలారు అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అనేవారని అంతగా ప్రతిభ చాటారన్నారు. ఇటీవల పోటీ పరీక్షల్లో పాల్గొనేవారి సంఖ్య తగ్గిందని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమకు ఆసక్తి కల్గిన రంగంలో రాణించేందుకు యూపీఎస్‌సీ వంటి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనాలన్నారు. అధ్యాపకుల మార్గదర్శకాలతో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్, హిస్టరీ విభాగాధిపతి డాక్టర్ షఫీ అహ్మద్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కోడిరంగప్ప, క్రెసెంట్‌స్కూల్ కార్యదర్శి మొహ్మద్ అన్సారి, అధ్యాపకులు ఉమేశ్‌రెడ్డి, విజేంద్రకుమార్, డాక్టర్ ఆదినారాయణప్ప, మొహ్మద్ సాదత్, అంజినప్ప, గిరిజా తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వార్షికోత్సవంలో తహసీల్దార్ తదితరులు

దేవాలయ అభివృద్ధికి రూ.15 కోట్లు విడుదల



భూమిపూజలో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తదితరులు

బంగారపేట, జూలై 5: పట్టణంలోని కోదండరామస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు 15కోట్ల రూపాయలు విడుదల చేసినట్టు ఎమ్మెల్యే నారాయణస్వామి వెల్లడించారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ఆలయంలో పార్కింగ్, కల్యాణమందిరం, పాలనా కార్యాలయం, దుకాణ సముదాయం, ఉద్యోగుల వసతి గృహం తదితర పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. దేవాలయ శాఖ ఆమోదించిన ప్లాన్ ప్రకారం ప్రజాపనులశాఖ పనులు చేపట్టేందుకు అంగీకారం తెలిపిందన్నారు. సుమారు 2వేల సంవత్సరాల చరిత్ర కల్గిన ఆలయానికి సంబంధించి 200 కోట్ల రూపాయల విలువైన ఆస్తిని కాపాడేందుకోసం జీర్ణోద్ధరణతోపాటు వాణిజ్యసముదాయం నిర్మించడం ద్వారా ప్రతినెలా కనీసం రూ.20లక్షల ఆదాయం సమకూర్చుకోవడంతోపాటు 200 కుటుంబాల జీవనానికి అనుకూలమయ్యేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఆరేళ్లక్రితం చేపట్టాల్సి ఉండగా సిద్దరామయ్య ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. నిర్మాణాల సందర్భంగా చుట్టుపక్కల ఉన్న దుకాణాలవారు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా బ్లాక్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పార్థసారథి, సీనియర్ నాయకులు నంజప్ప, చందు, పురసభ సభ్యులు అరుణాచలం, మణి, సాధిక్, వెంకటేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకు స్థలం ఏదీ..?

▸▸ అధికారులను నిలదీసిన గ్రామస్థులు

దొడ్డబళ్ళాపుర, జూలై 5: తాలూకాలోని మేడహళ్ళిలో స్మశానం కొరత కారణంగా ఒక వ్యక్తి మృతి చెందినా అంత్యక్రియలు నిర్వహించేందుకు సమస్య తలెత్తి గ్రామస్థులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఐదు తరాలుగా ఎవరైనా మృతి చెంది సర్వేలో అంత్యక్రియలు నిర్వహించేవారు. అయితే సదరు సర్వే నెంబరులోని భూమి తనదంటూ ఒక ప్రైవేట్ వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడు. దీంతో గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు సమస్య తలెత్తింది. ఇప్పటికే గ్రామస్థులు సమస్యను అధికారుల దృష్టికి తెచ్చినా చొరవ చూపలేదు. తాజాగా శుక్రవారం దేవరాజ్ (40) మృతి చెందాడు. అయితే అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేకపోవడంతో తాలూకా కార్యాలయం వద్ద శవంతో నిరసనకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న ఉపవిభాగాధికారి శ్రీనివాస్, డీఎస్పీ రవి, తహసీల్దార్ విభా విద్యారాథోడ్, సాంఘికసంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ ఉమాపతి పోలీసులు చేరుకున్నారు. గ్రామస్థులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామంలో ఉన్న 18గుంటల స్మశానానికి అదనంగా ఒక ఎకరా స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. చివరకు సాయంత్రానికి గ్రామస్థులను నచ్చచెప్పిన అనంతరం దేవరాజ్ అంత్యక్రియలు నిర్వహించారు.



శవం వద్ద గ్రామస్థుల నినాదాలు

కర్ణాటక రోడ్ల అభివృద్ధికి రూ. 2లక్షల కోట్లు

▸▸ భూసేకరణ బాధ్యత రాష్ట్రానిదే : కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో రోడ్ల అభివృద్ధికి 2లక్షల కోట్ల రూపాయలు విడుదల చేసేందుకు సిద్ధమని అయితే అందుకు అవసరమైన భూములను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చాలని కేంద్ర భూ ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరి తెలిపారు. గురువారం బీజేపీ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటీవలే సీఎం, డీసీఎంలు ఢిల్లీలో భేటీ అయ్యారన్నారు. కర్ణాటకకు 2 లక్షల కోట్ల రూపాయలు రోడ్ల నిర్మాణానికి కేటాయించేందుకు కేంద్రం సిద్ధమన్నారు. అందుకు భూస్వాధీన, అటవీ అనుమతులు పొందాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందే అన్నారు. గాలిలో రోడ్డు నిర్మించలేం కదా అన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కలసి పలు రోడ్లకు గ్రాంట్లు కేటాయించాలని కోరారన్నారు. కేంద్ర ప్రభుత్వం, తమశాఖలో నిధుల కొరత లేదన్నారు. ఇప్పటివరకు 3.5లక్షలకోట్ల రూపాయలు గ్రాంట్లు కేటాయించామన్నారు. రోడ్ల నిర్మాణాలకు పక్కా ప్రణాళికలతో వస్తే నిధులు కేటాయించేందుకు సమ్మతమే అన్నారు.

10 కోట్ల మందికి రోగ నిర్ధారణ పరీక్షలే లక్ష్యం

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పదికోట్ల మందికి న్యూబర్గ్ ఆనంద్ రెఫరెన్స్ ల్యాబరేటరీ ద్వారా రోగనిర్ధారణ జరపడం మైలురాయి అని ల్యాబ్ ముఖ్యులు డాక్టర్ ఎం జయరాం, సంజయ్‌ప్రసాద్‌లు ప్రకటించారు. న్యూబర్గ్ 50వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రకటించారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ 1974లో ప్రముఖ వైద్యుడు డాక్టర్ రామప్రసాద్ ల్యాబ్‌ను ప్రారంభించారన్నారు. కర్ణాటక లోని అన్ని జిల్లాల్లోనూ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుతం 5వేలకుపైగా వివిధ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. యాప్ ప్యాకేజీలు రాష్ట్ర మంతటా అమలు చేస్తున్నామన్నారు. వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు మాట్లాడుతూ ల్యాబ్‌లలో నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. దేశంలో తొలి సారిగా డిజిటల్ విధానాలు తీసుకొచ్చామన్నారు. కొవిడ్ ఆర్‌టీ పీసీఆర్ పరీక్షలను రాష్ట్రంలో అమలు చేసిన తొలి ల్యాబ్ అన్నారు. జాతీయ గుర్తింపు పొందామని ఎన్ఏ బీఎల్, ఐఎస్‌ఓ గుర్తింపు ఉన్నాయన్నారు.

తీరిన నీటి కొరత

చేళూరు, జూలై 5: చేళూరు తాలూకాలోని చాలా గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉండేది. ఇటీవల రుతుపవనాల ప్రభావం తర్వాత కురుస్తున్న వర్షాలతో నీటి కొరత తీరింది. పలు చోట్ల కుంటల్లోకి నీరు చేరుతోంది. గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లల్లో కూడా నీటి సంపులు చేపడుతున్నారు. చాలాచోట్ల ఎద్దడి తీరడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు సైతం నీరు లభిస్తోందన్నారు.

దొమ్మసంద్ర గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలిగా దివ్య

దొమ్మసంద్ర, జూలై 5: దొమ్మసంద్ర గ్రామపంచాయతీలో ఉపాధ్యక్షస్థానానికి జరిగిన ఎన్నికల్లో దివ్య డీహెచ్ భోజరాజు ఏకగ్రీవమయ్యారు. పంచాయతీతో రెండో అవధికి సంబంధించి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారురాలు దివ్య ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి జయలక్ష్మి ప్రకటించారు. నూతన ఉపాధ్యక్షురాలు దివ్యను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షుడు వీ నరేశ్, సభ్యులు బీసీ ఉమేశ్‌బాబు, డీఎస్ నాగరాజు, నారాయణప్ప, టీ రాజేశ్, మోహన్‌బాబు, రాజణ్ణ, సంతోష్, సురేశ్, కే కృష్ణారెడ్డి, నారాయణ టి, మురళి, ప్రభాకర్, గిరిజా, కవితా, సరస్వతి, మునీంద్ర, రత్నమ్మ, పీడీఓ వై మంజునాథరెడ్డి, కార్యదర్శి బోరేగౌడ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యక్షురాలు దివ్యను అభినందిస్తున్న ప్రముఖులు

ఘనంగా కెంపేగౌడ జయంతి

చేళూరు, జూలై 5: బెంగళూరు నగర నిర్మాత, నాడప్రభు కెంపేగౌడ 515వ జయంతి ఘనంగా నిర్వహించారు. తాలూకా కేంద్రమైన చేళూరులో శుక్రవారం కెంపేగౌడ చిత్రపటంతో వెండిరథంపై ఊరేగింపు నిర్వహించారు. కెంపేగౌడ వేషధారణ తో గుర్రపుస్వారీ ఆకట్టుకుంది. ఏటా కెంపే గౌడ జయంతి ఉత్సవాలు నిర్వహించదలిచారు. ఉత్సవంలో కె. శివారెడ్డి, రామ కృష్ణారెడ్డి, మధుకర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, అంజనేయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కెంపేగౌడ జయంతిలో పాల్గొన్న స్థానిక ప్రముఖులు

రేపు పావగడకు తుంగభద్ర నీరు

పావగడ, జూలై 5: పోరాటాల ఫలితంగా ఆదివారం నుంచి పావగడకు తుంగభద్ర తాగునీరు అందడం ఎంతో హర్షణీయమని రైతు సంఘం నాయకులు పూజారప్ప, బుద్ధ సంఘం నాయకులు మంజునాథ్, పెద్దన్న, తిప్పేస్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన వారు 2013సంవత్సరంలో కరువు తాలూకాగా పేరుగాంచిన చళ్ళకెరె, మొలకలమూరు, కూర్లగి, చిత్రదుర్గం తాలూకాలతోపాటు పావగడ కూడా జాబితాలో చేరడంతో ఈ ప్రాంతానికి నీరు చేరడం సుగమమైందన్నారు. 2013లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య రూ.2,350కోట్లతో విజయనగరం జిల్లా నుంచి దాదాపు 250 కి.మీ పావగడవరకు పైప్‌లైన్ ద్వారా ఈ నీరు సాగించడానికి ప్రణాళిక తయారుచేసి నిధులు విడుదల చేశారన్నారు. దాదాపు 226 గ్రామాల్లో 46వేల కుటుంబాలు ఈ తాగునీటి లబ్ధి పొందుతారన్నారు. కరువు ప్రాంతమైన పావగడలో తుంగభద్ర నీటితో పంటలు పండి సశ్యశామలంగా మారుతుందన్నారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

పావగడ, జూలై 5: నాడ ప్రభు కెంపేగౌడ జయంతి సందర్భంగా స్థానిక బీఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించిన విద్యార్థుల ప్రతిభా పోటీలలో శుక్రవారం విజేతలకు డీఈఓ ఇంద్రాణి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆరు పాఠశాలల నుంచి తొమ్మిది మంది విద్యార్థులు చొప్పున డ్రాయింగ్ కాంపిటీషన్, చర్చాగోష్టి, వ్యాసరచన పోటీలలో విజేతలైన 54మందికి డీఈఓ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్థిరమైన లక్ష్యంతో చదివితే విజయం సాధించడం కష్టం కాదన్నారు. కార్యక్రమంలో ఆదర్శ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, టీచర్లు జగన్నాథ్, పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులను పరిశీలించిన కేంద్ర బృందం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5: జిల్లాలోని పీఏబీఆర్, హెచ్ఎల్ఎంసీలను కేంద్రజలశక్తి అభియాన్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది.



పీఏబీఆర్‌ను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ అధికారుల బృందం

జలశక్తి అభియాన్ కేంద్ర అధికారులు అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్‌ఖాన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషా, హెచ్చెల్సీ ఈఈ శ్రీనివాసుల బృందం ఆయా ప్రాంతాలను పరిశీలించింది. తొలుత హెచ్చెల్సీ పరిధిలోని పీఏబీఆర్ డ్యాంకు వెళ్లిన అధికారుల బృందం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం, నాణ్యత, లీకేజీ, మొక్కలు పెరిగిన పరిస్థితులను పరిశీలించారు. పూర్తిస్థాయి నీటి నిల్వకు అవసరమైన భూసేకరణ, డ్యాం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలవను పరిశీలించారు. అక్కడ పీఏబీఆర్ లింక్‌చానల్ సామర్థ్యం, నాణ్యతను పరిశీలించారు. ఈమేరకు అధ్యయనం చేసిన అంశాలను కేంద్రప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. తరచూ డ్యాం పర్యవేక్షణ చేయాలని, మరమ్మతులకు సంబంధించి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డ్యాం, హెచ్చెల్సీ నిర్వహణ పై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వహణ లేకపోతే తీరని నష్టం జరిగే ప్రమాదముందని హెచ్చరించారు.

కేరళలో ఆఫ్రికన్ పంది జ్వరం... కర్ణాటకలో భయం

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం త్రిచూర్ జిల్లా మడక్కతార పంచాయతీ పరిధిలో ఆఫ్రికన్ పందిజ్వరం ప్రబలింది. పందులద్వారా వ్యాపించే జ్వరం అత్యంత ప్రమాదకరమైనది. అడవిపందులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మడక్కతార పంచాయతీలోని ప్రైవేట్‌భూమిలో 310 పందులను చంపేందుకు త్రిస్సూర్ జిల్లాఅధికారి ఆదేశించారు. కర్ణాటకకు అనుబంధమైన కేరళలో పందిజ్వరం వ్యాపించడంతో రాష్ట్రంలోనూ ఈ ప్రభావం ఉంటుందనే ఆందోళన నెలకొంది. ఇప్పటికే కర్ణాటకవ్యాప్తంగా డెంగీ జ్వరం తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రమంతటా రోజూ వందల కొలదీ కేసుల నమోదవుతున్నాయ. డెంగీతో ఆసుపత్రి పాలయ్యేవారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. డెంగీ నివారణకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటోంది. తాజాగా కేరళలో పందిజ్వరం ప్రబలడంతో అనుబంధ జిల్లాలు కొడగు, చామరాజనగర, దక్షిణకన్నడ జిల్లాల్లో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు.

వాహనాలకు హైబీమ్ ఎల్ఈడి లైట్ల నిషేధం

బెంగళూరు మెట్రో, జూలై 5: రోడ్డు ప్రమాదాలు తప్పించడానికి మోటారు వాహనాల నియమ నిబంధనలకు అనుగుణంగా అనుమతించిన లైట్లను మాత్రమే వాహనాలకు వాడాలని ఎట్టి పరిస్థితుల్లోనూ హైబీమ్ ఎల్ఇడి లైట్లను అనుమతించేది లేదని అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్ అండ్ సేఫ్టీ) అలోక్‌కుమార్ వెల్లడించారు. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలమేరకు అధిక వెలుతురునిచ్చే ఈ బల్బుల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బంది కలకగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రజలు సహకారం అందించాలన్నారు. ఈనెల 1నుంచి అమలులోకి రాగా రెండు రోజుల్లో 1500కుపైగా కేసులు నమోదైనట్టు తెలుస్తోంది.

సిజేరియన్ వేళ... శిశువు మర్మాంగాన్ని కత్తిరించిన డాక్టర్

▸▸ దావణగెరెలో దారుణం



చిగటేరి ఆసుపత్రి (ఇన్‌సెట్‌లో శిశువు)

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం తరచూ వినిపిస్తుంటుంది. ప్రస్తుతం దావణగెరె జిల్లా చిగటేరి ఆసుపత్రిలో ఓ డాక్టర్ నిర్లక్ష్యంతో పసికందు ప్రాణం పోయింది. సిజేరియన్ చేసే వేళ పసికందు మర్మాంగాన్ని కోశారు. దావణగెరెలోని కొండజ్జి రోడ్డులోని అర్జున్ భార్య అమృత కాన్పుకోసం జిల్లా ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ కాన్పు సాధ్యం కాదని సిజేరియన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. అందుకు అనుగుణంగానే జూన్ 27న అమృతకు సిజేరియన్ చేశారు. ఆపరేషన్ చేసిన డాక్టర్ నిజాముద్దీన్ శిశువును బయటకు తీసే సమయంలో మర్మాంగాన్ని కోశారు. ఆ తర్వాత శిశువు పరిస్థితి ఆందోళనకరమైంది. వెంటనే జిల్లా ఆసుపత్రి నుంచి బాపూజి ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు ఫలించక శిశువు శుక్రవారం మృతి చెందింది. శిశువు మృతికి డాక్టర్ కారణమని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేశారు. జిల్లాఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. నిర్లక్ష్యం చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేణుకాస్వామి హత్యకేసులో హాజరైన 'మిలన' ప్రకాశ్

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకా స్వామి హత్యకేసులో సినీ దర్శకుడు 'మిలన' ప్రకాశ్ విచారణకు హాజరయ్యారు. బసవేశ్వరనగర పోలీస్ స్టేషన్‌కు శుక్రవారం వచ్చిన ఆయనను సుదీర్ఘంగా విచారణ జరిపారు. రేణుకాస్వామి హత్య అనంతరం నటుడు దర్శన్ డెవిల్ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. షూటింగ్ వేళ హత్యకు సంబంధించి చర్చలు జరిగాయా, దర్శన్ ఏ విధంగా వ్యవహరించారనే కోణంలో ఆరా తీశారు. హత్యకు ముందు ఎప్పుడు కలిశారు, సినిమాకు సంబంధించి ఎంతమేర నగదు ఇచ్చారని ప్రశ్నించినట్టు తెలుస్తోంది ఈ కేసులో కొత్త సాక్ష్యాలను పోలీసులు విచారించేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్శన్ ఇంట్లో పనిచేసే బాబుల్‌ఖాన్, సుశీలమ్మ, అమీర్‌ఖాన్‌లను విచారించదలిచినట్టు తెలుస్తోంది స్టోని గ్రూప్ రెస్టారెంట్‌లో పనిచేసే చేతన్‌ను విచారించదలిచారు. మాజీ డిప్యూటీ మేయర్ మోహన్‌రాజ్‌ను కూడా విచారించాలని పోలీసులు సిద్ధమయ్యారు. రేణుకాస్వామి హత్య కేసులో కార్తీక్ పురోహిత్ అనే వ్యక్తికి నోటీసులు ఇచ్చారు. ప్రద్యూష్ సూచన మేరకు సంఘటనా స్థలానికి వచ్చిన కార్తీక్‌కు నోటీసులు ఇచ్చారు. ఇతను కొన్ని రోజులుగా పరారీలో ఉన్నాడు. పోలీసులు ఓ రహస్య వ్యక్తి ఉన్నారని కోర్టుకు వివరించారు. అందుకు అనుగుణంగానే కార్తీక్ పురోహిత్‌ను విచారించదలిచారు.